

ఉత్తమ బహుమతి అందుకుంటున్న రామాయంపేట లయన్స్ క్లబ్ సభ్యులు

## రామాయంపేట లయన్స్ క్లబ్‌కు అవార్డు

రామాయంపేట, జూన్ 10: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రామాయంపేట లయన్స్ క్లబ్ ఉత్తమ బహుమతిని అందుకుంది. దశాబ్ద కాలంగా రామాయాంపేట లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలకు నిజామాబాద్ లయన్స్ గవర్నర్ లక్ష్మి అవార్డును అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కార్యదర్శి, జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, దేమె యాదగిరి, వంగరి కైలాస్, దామోదర్‌రావు ఉన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శివ్వంపేట, జూన్ 10: మండలంలోని గోమారం జడ్పీహెచ్ఎస్‌లో 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, రాఘవులు, శివకుమార్, ఇంద్ర, లక్ష్మీనారాయణలను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

చిలిపిచెడ్, జూన్ 10: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని, ప్రతి షాపులో స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఉండాలని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి అన్నారు. సోమవారం మండలంలోని అంతారం, సోమక్కపేట పీఏసీఎస్ ఫర్టిలైజరును తనిఖీ చేసి విత్తనాల శాంపిల్స్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించొద్దన్నారు. రైతు తప్పనిసరిగా కొన్న ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో బాల్‌రెడ్డి, ఏఈవో భూపాల్, రమ్య, ఫర్టిలైజరు యాజమనులు, రైతులు ఉన్నారు.



ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ పుణ్యవతి ఏవో బాల్‌రెడ్డి

## భూసేకరణకు హక్కు పత్రాలు సమర్పించాలి

**– ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి**

నర్సాపూర్, జూన్ 10: నర్సాపూర్ రెవెన్యు డివిజన్‌లోని గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ (ఆర్‌ఆర్‌ఆర్) మార్గం అభివృద్ధికి 27.791 భూమిని సేకరించేందుకు హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ రహదారుల చట్టం ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం భూములు, ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రకటన జారీ చేసిందని తెలిపారు. రైతుల సమాచారం కోసం భూమి/ఆస్తులపై వారి హక్కు తెలియజేస్తూ ఈ ప్రతులను గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రకటనలో చూపిన తేదీ, సమయం ప్రకారం హక్కు పత్రాలు సమర్పించాలని వెల్లడించారు. మండలంలోని నాగులపల్లి, మహమ్మదాబాద్, తిరుమలపూర్, తుజాల్‌పూర్, పెద్దచింతకుంట, మూసాపేట్, ఖాజీపేట్ గ్రామాల రైతులు నర్సాపూర్‌లోని రైతువేదికలో నిర్వహించే సమావేశానికి ఈ నెల 12న హాజరుకావాలని కోరారు. శివ్వంపేట్ మండలంలోని ఉసిరికపల్లి, గుండ్లపల్లి, పాంబండ, కొత్తపేట్, పోతులబోగూడ, లింగోజిగూడ రైతులు ఈ నెల 14న నర్సాపూర్‌లోని రైతువేదికలో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

## త్వరగా రైతుభరోసా డబ్బులు వేయాలి



మాట్లాడుతున్న రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్

నర్సాపూర్, జూన్ 10: వానకాలం పంట పెట్టుబడి నిమిత్తం రైతుభరోసా పథకం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్‌లోని రైతువేదికలో జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కలిసి రైతు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, రైతులు ప్రభుగౌడ్, అర్జున్, శేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.

## చిట్కుల్ కేజీవీబీలో తాగునీటి అవస్థలు

**సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వినోద**

చిలిపిచెడ్, జూన్ 10: చిట్కుల్ కేజీవీబీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని కేజీవీబీ ప్రత్యేక అధికారి అంజలి పేర్కొన్నారు. సోమవారం చిలిపిచెడ్ మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీడీవో ఆనంద్ ఆధ్వర్యంలో ఎంపీపీ వినోదా దుర్గారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వానకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాన్నారు. దవాఖానలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు సరైన వైద్యం అందించాలన్నారు. మండలంలోని అసైన్డ్ భూముల్లో అనుమతి లేకుండా ఇటుకబట్టీలు నడిపిస్తున్నా రెవెన్యూ అధికారుల పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని విద్యుత్ అధికారులకు తెలిపారు. తరగతి గదిల్లో ఉపాధ్యాయులు సెల్ ఫోన్లో మాట్లాడకుండా చూసుకోవాలని చిట్కుల్ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి ఎంఈవోకు తెలిపారు. గ్రామాల్లో బడీడు పిల్లలను బడిలో చేరిపించాలని ఎంఈవో బుచ్చానాయక్ సభలో తెలిపారు. నర్సాపూర్ నుంచి వయా చిలిపిచెడ్ మీదిగా జోగిపేట వరకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో డబ్బులు ఎక్కువగా వసూలు చేస్తున్నారని, దీనికి బదులు పల్లెప్రగతి బస్సులు నడిపి, ప్రతి స్టేజ్‌లో ఆపాలని మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీయోద్దీన్ ఆర్టీసీ సిబ్బందికి కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విశ్వంభరస్వామి, ఎంపీటీసీలు మల్లమ్మ, సునీత, ఎంఈవో బుచ్చానాయక్, ఏవో బాల్‌రెడ్డి, పీఆర్‌ఏఈ మధుబాబు, మిషన్ భగీరథ ఏఈ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.



చిలిపిచెడ్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి

## శ్మశాన వాటిక హక్కు పత్రం ఇవ్వండి

నర్సాపూర్, జూన్10: మండలంలోని కాగజ్‌మద్దూర్‌లోని దళితుల శ్మశాన వాటిక హక్కు పత్రాన్ని ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం కోరారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ తాతముత్తాతల నుంచి మృతిచెందిన వారిని ఆ సర్వే నంబర్లో ఖననం చేస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి దళితుల శ్మశాన వాటిక స్థలం వారికే చెందేలా హక్కు పత్రం ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, గ్రామస్తులు కుమార్, యాద య్యా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్.. ఫట్!

- జిల్లాలో 160 ప్రైవేటు స్కూల్ బస్సులు
- ఇప్పటి వరకు 70 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు
- మరో 90 బస్సులకు కండిషన్ ఎప్పుడో..?
- ఈ నెల 12 నుంచి విద్యాసంస్థలు ప్రారంభం
- స్పందించని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం

**ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తాం**



నిబంధనలు పాటించని బస్సులు రోడ్లపైకి రావద్దు. ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తాం. ప్రైవేటు స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోవడానికి ఈ నెల 12వ తేదీ వరకు అవకాశం ఉంది. 15 ఏండ్లు పైబడిన బస్సులు తిరగడానికి అవకాశంలేదు. అనుమతి లేకుండా పాఠశాలల బస్సులు నడిపినా.. నిబంధనలు విస్మరించినా కఠిన చర్యలు తీసుకుంటాం.

**- వెంకటస్వామి, డీటీవో మెదక్**



మెదక్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు రూ.లక్షలు ఖర్చు పెట్టి ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. బాధ్యతగా ఉండాల్సిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కాలం చెల్లినవి, సామర్థ్యం లేని వాహనాల్లో పిల్లలను పాఠశాలలకు చేరవేస్తున్నారు. దీంతో పసిప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మే 15 నుంచి జూన్ 1 వరకు ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో జిల్లాలో 160 స్కూల్ బస్సులుంటే వాటిలో కేవలం 70 మాత్రమే ఫిట్‌నెస్ పరీక్ష చేయించాయి. మరో 90 బస్సులు రాలేదు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం కావడానికి ఒక్క రోజు మాత్రమే ఉండడంతో ఆలోగా పరీక్షలు చేయడం కష్టమే. రేపటిలోగా ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకుని సర్టిఫికెట్ పొందాలని, లేకుంటే తనిఖీల్లో బస్సులు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**చిన్నారుల ప్రాణాలతో చెలగాటం**

జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్నాయి. దీంతో అభం, శుభం తెలియని చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్, అటెండెంట్ లేకుండానే బస్సులు నడపడం లాంటివి చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ ధృవీకరణ పత్రాల జారీకి కఠిన నిబంధనలు చేసింది.

**నిత్యం 50 వేల మంది**

జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తరలించేందుకు 160 బస్సులు ఉన్నాయి. వీటితో నిత్యం సుమారు 50 వేల మంది విద్యార్థులను ఆయా సంస్థలకు తరలిస్తుంటారు. ఈ బస్సులకు ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు చేసి, అనుమతి పత్రాలు పొందాల్సి ఉంటుంది. విద్యాసంస్థలకు పసుపు రంగు గుర్తు కేటాయించడంతో పాటు రక్షణ, సౌకర్యం కోసం ప్రభుత్వం పలు నిబంధనలు రూపొందించింది. బస్సుల నిర్వహణకు సంబంధించి విద్యార్థుల పూర్తి సంరక్షణ బాధ్యత తమదేనంటూ పాఠశాల యాజమాన్యాలు రవాణా శాఖకు హామీ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అది పూర్తి స్థాయిలో అమలు కావడంలేదు.



**ఫిట్‌నెస్ లేని ప్రైవేటు స్కూల్ బస్సులు సీజ్ చేయాలి**

ఫిట్‌నెస్ లేని ప్రైవేటు స్కూల్ బస్సులు సీజ్ చేయాలి. జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన 180 బస్సులు ఉన్నాయి. ఇందులో కేవలం 80 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నారు. 100 బస్సులు ఫిట్‌నెస్ లెకుండానే తిరుగుతున్నాయి. ఫిట్‌నెస్ చేయించుకోలేని ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. బస్సుల ఫిట్‌నెస్ చేయించుకోలేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి. **– నవీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు**

## వేగంగా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ
- అక్షరాస్యతపై అధికారులతో సమీక్ష



ప్రజావాణిలో ప్రజలు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 10: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యలు పరిష్కారమైతేనే ప్రజావాణిపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజావాణిలో భూసమస్యలపై 30 దరఖాస్తులు, పింఛన్ల కోసం 10, డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం 3, ఇతర 48 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు.

10ఎండికెఎమ్04ః ప్రజావాణిలో ప్రజలు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం**

జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించడంలో అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్‌లోని సమావేశ హాల్‌లో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నారు. గతంలో కంటే ఎక్కువ అక్షరాస్యత నమోదు చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని, గ్రామస్థాయిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని, గ్రామ మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు.

**పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి**

పాఠశాలల పునఃప్రారంభం నాటికి శుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజన కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యూనిఫాంలు కుట్టించి, పాఠశాల ప్రారంభం రోజే అందించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ సైతం అందజేయాలన్నారు. ప్రతి పాఠశాలలో తాగు నీరు, విద్యుత్తు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

### అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, జూన్ 10: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అధికారులకు ఆదేశించారు. సో మవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. తన అత్తమామలకు ముగ్గురు సంతానమని, తన భర్త అందరికంటే చిన్నవాడని, ఏడాది క్రితం ఆయన మృతి చెందాడని, తన భర్త తాత నుంచి వారసత్వంగా సక్రమించిన భూమిని తమ అత్త రిజిస్ట్రేషన్ చేసుకున్నదని, ఈ భూమి సర్వే నంబర్ 569లో 27 గుంటలు ఉండగా రెం డో కుమారుడికి 8 గుంటలు, పెద్ద కుమారుడికి 6 గుంటలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, తన వాటా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నానరని తూప్రాన్ మండలం హైదర్‌గూడకు చెందిన పిట్ల చంద్రకళ ఫిర్యాదు చే సింది. వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరింది. ఫిర్యాదికి న్యాయం చేయాలని తూప్రాన్ ఎస్సైని ఎస్పీ ఆదేశించారు.



అర్జీదారు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

## సమన్వయంతో ప్రభుత్వ పథకాలు అందించాలి

- ఎరువులు విత్తనాల కొరత లేదు
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతూ.. వానకాలం మొక్కలు నాటే లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. పోలీస్ అధికారులు శాంతిభద్రతలను పరిరక్షించాలని, ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలన్నారు. అక్రమంగా ఇసుక వ్యాపారం చేసే వారి మీద చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

**సహకార సంఘాలు బలోపేతం కావాలి**

సహకార సంఘాలు బలోపేతం కావాలని, రైతు సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య రావద్దని, సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గొర్రెల కోసం డీడీలు ఇచ్చిన వారికి వాపస్ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేస్తూ జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ రాహుల్‌రాజ్ పల్లెనిద్ర




జక్కపల్లిలో పల్లెనిద్ర చేస్తున్న కలెక్టర్

గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూన్10: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ మండలంలోని జక్కపల్లి గ్రామంలో సోమవారం పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుకోవడంతో మానసిక పరిపక్వత సాధించవచ్చన్నారు. జిల్లాలోని గ్రామ, మండల, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు పల్లె నిద్ర చేయాలని ఆదేశించారు. మహిళా ఉద్యోగులకు వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. పల్లె నిద్రలో భాగంగా అధికారులు మంగళవారం పొద్దున గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

## గొడవతో నిలిచిన ఉపాధి పనులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

చిన్నశంకరంపేట, జూన్ 10: రెండు గ్రామాల మధ్య గొడవతో ఉపాధి పనులు నిలిచిపోయిన ఘటన మండలంలోని అంబాజిపేటలో సోమవారం జరిగింది. అంబాజిపేటకు చెందిన ఉపాధి కూలీలు గ్రామ శివారులోని పెద్ద చెరువులో మట్టిని తీయడానికి వెళ్లారు. చెరువులో మట్టిని తీస్తుండగా మండలంలోని సంగాయపల్లి గ్రామస్తులు తమ పట్టా పొలాల నుంచి మట్టిని ఎలా తీస్తారని కూలీలను అడ్డుకుని, రెవెన్యు అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు శిఖం నుంచి మట్టిని తీసుకుంటే అభ్యంతరం లేదని, పట్టా పొలాల నుంచి మట్టి తీస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న రెవెన్యు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు గ్రామాల ప్రజలను సముదాయించి, శిఖం భూమి ఎక్కడ నుంచి ఉందో తేలిన తర్వాతనే మట్టిని తీయాలని, అప్పటి వరకు చెరువు నుంచి మట్టిని తీయవద్దని సూచించారు.

### రైతులకు తప్పనిసరిగా రసీదులు అందించాలి

చిన్నశంకరంపేట, జూన్ 10: విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని ఫర్టిలైజర్ యజమానులకు ఏవో అధికారి లక్ష్మీప్రవీణ్ సూచించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని గవ్వలపల్లి చౌరస్తాలో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

## గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తూ..

చిన్నశంకరంపేట, జూన్ 10: గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పట్టుబడిన ఘటన మండలంలోని దర్పల్లిలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ వారు దర్పల్లి గ్రామంలో సిలిండర్ సరఫరా చేస్తున్నారు. ఆటో డ్రైవర్ గ్రామ శివారులో ఆపి సిలిండర్ నుంచి రెండు కిలోల చొప్పున గ్యాస్ తీసి ఇతర సిలిండర్‌లోకి రీఫిల్లింగ్ చేస్తుతున్నాడు. గ్రామస్తులు అతడిని పట్టుకున్నారు. ఒక్కో సిలిండర్ నుంచి రెండు కిలోల చొప్పున గ్యాస్ తీసి వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నీట్ అవకతవకలపై విచారణ చేపట్టాలి

**బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి కిరణ్**



మెదక్ మున్సిపాలిటీ, జూన్ 10: నీట్-24 పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే వి చారణ చేపట్టాలని బీఆర్ఎస్వీ జిల్లా అధికారి ప్రతినిధి కసాపురం కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసాధారణ రీతిలో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన 67 మందికి టాప్ ర్యాం కులు రావడం అనుమానాలకు తావిస్తున్నదని విమర్శించారు. దీనిపై ఎన్‌టీఏ అధికారులు సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

### డీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 10: ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు 2024-26 విద్యా సంవత్సరానికి ఈ నెల 30వ తేదీలోగా డీసెట్-24 అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కేటగిరీ వారికి 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. మెదక్ డైట్‌లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియాల్లో 50 సీట్ల చొప్పున, డీపీఎస్సీలో 50 సీట్లతో కలిపి మొత్తం 200 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రైవేటు కళాశాలల్లో 300 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు http://deecet,cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సందర్శించాలన్నారు.

## ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

చిలిపిచెడ్,జూన్ 10: ఈ నెల 30తో ఎంపీపీ, ఎంపీటీసీల పదవి విరమణ ముగింపు కావడంతో ముందుగా ఎంపీడీవో ఆనంద్‌కు ప్రజా పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపీపీ, ఎంపీటీసీలు కలిసి మండల అభివృద్ధికి పని చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది ఉన్నారు.

## కేబుల్ వైర్ చోరీ

నర్సాపూర్, జూన్ 10: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ కార్యాలయానికి చెందిన బోరు నుంచి గుర్తుతెలియని దుండగులు ఆదివారం రాత్రి కేబుల్ వైర్‌ను దొంగలించారు. అగంతకులను పట్టుకుని కేబుల్ వైర్‌ను రికవరీ చేయాలని, నిందుతులకు శిక్ష విధించాలని ఎంపీడీవో మధులత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి పెట్రోలింగ్ నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయానికి రక్షణ కల్పించాలని కోరారు.

## మూడు టిప్పర్లు సీజ్

నర్సాపూర్, జూన్ 10: అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను సీఐ జాన్‌రెడ్డి ఆదేశాల మేరకు సీజ్ చేసి కేసు నమోదు చేస్తొందని ఎస్సై పుష్పరాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా మండల పరిధిలోని మూసాపేట్ గ్రామం చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మట్టిని, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-334218

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

